సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 102 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం | 12.08.2025



## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

3 లో



# ఇందిరమ్మ మోడల్ హౌస్ ప్రకారమే ఇంటి నిర్మాణం ఉండాలి

- లబ్ధిదారులు ఆర్థిక భారాన్ని పెంచుకోవద్దు
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్

**జనగామ, మన చౌరాస్తా :**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతమయ్యేలా చూడాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ అన్నారు. జిల్లాలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి ని, అలాగే క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను సోమవారం ఎండీ పరిశీలించారు. ముందుగా నిడిగొండలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి పలు విషయాలను తెలుసుకున్నారు. ఇళ్లను ఎప్పుడు ప్రారంభించారు, ఇసుక, మొరం తదితర విషయాల్లో ఏమైన సమస్యలు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. లబ్ధిదారులకు ఆర్థిక భారం తగ్గాలంటే, నిబంధనల ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు జరగాలని సూచించారు. ఇందిరమ్మ మోడల్ హౌస్ ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు జరిగేలా అధికారులు చూడాలని, తద్వారా లబ్ధిదారులకు ఆర్థిక భారం తగ్గుతుందని సూచించారు. అనంతరం కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి ఎంపీడీఓ, హోసింగ్ ఏ ఈ లతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల పురోగతి పై రివ్యూ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 5,745 ఇళ్లకు మంజూరు ఇవ్వగా.. ఇప్పటి వరకు 4,560 ఇల్లు గ్రౌండింగ్ అయ్యాయని, 1999 బెస్మెంట్ లెవల్, 274 రూఫ్ లెవల్, 166 స్లాబ్ లెవల్ వరకు ఇళ్ల నిర్మాణం అయ్యయన్నారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో సందర్శన చేస్తూ ఇసుక, కంకర తదితర మెటీరియల్ విషయం లో లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా తగు చర్యలు తీసుకున్నమన్నారు. అనంతరం ఎండీ



మాట్లాడుతూ... హౌసింగ్ అధికారులు తహసీల్దార్, ఎంపీడీవోలతో సమన్వయము చేసుకుంటూ... ఉచితంగా ఇసుక టోకెన్లు అందిస్తూ.. పురోగతిని సమీక్షించాలన్నారు. లబ్ధిదారుల ఆధార్ నెంబర్ కు లింక్ అయిన బ్యాంక్ ఖాతాలోకి దశల వారీగా బిల్లు మొత్తం జమవుతుందన్నారు. సిబ్బంది కొరత సమస్య ను ఎండీ దృష్టికి తీసుకెళ్లగా ప్రతీ 500 ఇళ్ళకి ఒక ఏఈ ఉండేలా త్వరలోనే కేటాయిస్తామన్నారు. కలెక్టరెట్ కి వచ్చిన ఎండీ ముందుగా ప్రవేశం లో ఉన్న ఫొటో గ్యాలరీ ని సందర్శించి జిల్లా కి సంబంధించిన అన్ని రకాల సమాచారాన్ని ఫొటోల రూపంలో చక్కగా ఆరెంజ్ చేసారని అభినందించారు. సమావేశంలో హోసింగ్ పీడీ మాత్రు నాయక్, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఏఈలు పాల్గొన్నారు.



## కొన ఊపిరితో కోమాలోకి తండ్రి..

- తనకు సంబంధంలేదంటున్న కసాయి కొడుకు

2 లో

wanted

విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way




# నేడు విద్యాసంస్థల బంద్

**చేర్యాల, మన చౌరాస్తా :** నేటి విద్యాసంస్థల బంద్ ను రాష్ట్ర ప్రభుత్వం మినీ సకల జనుల సమ్మెగా గుర్తించి తక్షణమే రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం చేర్యాల మండల కేంద్రంలోని జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. చేర్యాల అస్తిత్వం ఉనికి, ఆత్మగౌరవం కోసం జరిగే పోరాటంలో భాగంగా నేడు మంగళవారం జరిగే విద్యాసంస్థల బంద్ లో దాదాపు ప్రత్యక్షంగా 15,000 వేలా మంది విద్యార్థులు, పరోక్షంగా దాదాపు 11వందల మంది ఉపాధ్యాయులు, 115 పాఠశాలలు, ప్రైమరీ, హై స్కూల్, గురుకుల, మోడల్, కస్తూరిబా, జూనియల్, డిగ్రీ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు బంద్ లో పాల్గొననున్నాయని, పరోక్షంగా 30వేల మంది తల్లిదండ్రులు భాగస్వాములు అవుతున్నారని కావున ప్రభుత్వం తక్షణమే ఈ బంద్ ను మినీ సకల జనుల సమ్మెగా గుర్తించి వెంటనే చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలికంగా నలిగిపోతున్నటువంటి చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశాన్ని మరింత జాప్యం చేయకుండా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల రాబోయే రోజుల్లో అధికార పార్టీకి మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, గడిపే బాలనర్సయ్య, పోలోజు వెంకటాద్రి, కుడిక్యాల బాలమోహన్, జంగిలి యాదగిరి, వలబోజు నర్సింహా చారి, కత్తుల భాస్కర్ రెడ్డి, బూరుగు సత్తయ్య గౌడ్, నంగి కనకయ్య, కర్రే నర్సిరెడ్డి, లింగంపల్లి బాబు, పొనుగోటి శ్రీనివాస్ రెడ్డి, కత్తుల లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# కొన ఊపిరితో కోమాలో తండ్రి..

## తనకేం సంబంధం లేదంటున్న కొడుకు..

**కోహెడ, మన చౌరాస్తా :** నవ మాసాలు మోసిన తల్లి సమాజంలో తనకంటూ గుర్తింపు వచ్చేదాకా తోడుగా నిలిచిన తండ్రి ప్రేమను గుర్తించని ఓ కొడుకు కన్న తండ్రి కోమాలో కొనవుపిరితో కొట్టుమిట్టాడుతుండగా నాకేం సంబంధం లేదు అంటున్న ఓ మానవత్వం లేని ప్రబుద్ధుడి కథనం ఇది..

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నకరకొమ్ముల గ్రామానికి చెందిన పూసల వర్గానికి చెందిన కోనేటి కుమార్ జీవితం కన్నీటి గాధగా మారింది. కొడుకుకు పెళ్లి చేసిన అనంతరం కొడుకు అత్తింటి వద్దే స్థిరపడి, తండ్రి ఆరోగ్యం పట్ల కనీస శ్రద్ధ చూపకపోవడంతో కుమార్ మానసికంగా తీవ్ర ఆవేదనకు గురై కోమాలోకి జారిపోయారు. ప్రస్తుతం ఆయన నోరు కదల్పలేని పరిస్థితులలో ఉన్నారు. పాలు కూడా మింగలేని ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. తండ్రి ఆరోగ్య పరిస్థితిని కొడుకుకి ఫోన్ ద్వారా వివరించగా, 'నాకు సంబంధం లేదు, చట్ట ప్రకారం ఏం చేస్తారో అది చేసుకోండి, లేకపోతే మీరే ఏదైనా చేయండి' అని ఇరవైఏండ్లకు పైగా పెంచి పెద్ద చేసి, విద్యాబుద్ధులు నేర్పించిన తండ్రి పట్ల కర్కశంగా స్పందించడం స్థానికులను కదిలించింది. గ్రామంలో ఈ బాధాకరమైన విషయం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన తెలుసుకున్న కోహెడ మండల పూసల సంఘం నాయకులు కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ పరిస్థితి చూసి



వారు చలించిపోయారు. కుమార్ భార్య నాగమణి కూలి పనులు చేస్తూ సొంత ఇల్లు లేక గుడిసెలో నివసిస్తూ భర్తను పోషిస్తోంది. సిద్దిపేట జిల్లా పూసల సంఘం అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం మాట్లాడుతూ ప్రభుత్వం వీరి కుటుంబ దయనీయ పరిస్థితిని అర్థం చేసుకొని, వీరి కుటుంబానికి ఆర్థిక, వైద్య సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తమ కుల బాంధవులకు కష్టం వస్తే సంఘం తరపున ముందు వరుసలో ఉండి ఆదుకుంటామని ఈ సందర్భంగా ఆయన అన్నారు. పరామర్శించిన వారిలో పూసల సంఘం మండల ఉపాధ్యక్షుడు చేను తిరుపతి, ప్రధాన కార్యదర్శి ఖమ్మం తిరుపతి, నాయకులు తుపాకుల లక్ష్మణ్, ముద్రకోల సంతు, ముద్రకోల రాజు, పట్టేం రాజు, పట్టేం సంపత్ తదితరులు ఉన్నారు.







# నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం

**వరంగల్, మన చౌరాస్తా :** నులిపురుగుల నివారణ తోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎన్. ఎల్.ఈ.పి/ హెచ్.ఐ.వి. ఎయిడ్స్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్.మోహన్ సింగ్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం వరంగల్ జిల్లా ఏ.వీ.వీ. హై స్కూల్, ఆంధ్ర బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్.మేరుగు యశస్వినీ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మోహన్ సింగ్ మాట్లాడుతూ.. బాలబాలికలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్నట్లు చెప్పారు. ఒక సంవత్సరం నుంచి 2 సం.లు ఉన్న చిన్నారులకు భోజనం తరువాత అల్బెండజోల్ సగం మాత్ర, 3సం.ల నుండి 19సం.ల విద్యార్థులకు అల్బెండజోల్ ఒక మాత్ర భోజనం అనంతరం అందజేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆదేశించారు. కార్యక్రమంలో డి.పి.హెచ్.ఎన్.ఓ. మనోజ, డీఏపీసీయు యూనిట్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ ఎన్.స్వప్న మాధురి, డిస్ట్రిక్ట్ ఐసీటీసీ సూపర్‌వైజర్ అదేపు రామకృష్ణ, డిస్టిక్ అసిస్టెంట్ కమలాకర్, యు.ఎఫ్.డబ్ల్యు.సి ఎం.జీ.ఎం.పి.పి.యూనిట్ సూపర్‌వైజర్ నర్మద, ఏ.ఎన్.ఎం.లు లక్ష్మి బాయి, రాజ సులోచన,ఆశ కార్యకర్తలు, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# వంగరలో 79 ఫీట్ల జాతీయ జెండా నిర్మాణం

**వరంగల్, మన చౌరాస్తా :** విద్యార్థి దశ నుంచే జాతీయ భావాన్ని పెంపొందించాలని ఆలోచనకొద్దీ కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి సరికొత్త ప్రయోగానికి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని డాక్టర్ పివి రంగారావు స్మారక బాలికల గురుకుల పాఠశాలను వేదిక చేసుకున్నారు. ఈ క్రమంలో సోమవారం నాడు వంగర గురుకుల పాఠశాలలో ఈ ఏడాది 79 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో 79 ఫీట్ల జెండా గద్దె, 9 ఫీట్ల పొడవు 12 ఫీట్ల వెడల్పుతో జాతీయ పతాకము రెపరెపలాడేలా అట్టి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ ఆగస్టు 15 నాడు ఆ జాతీయ జెండా ఎగరవేసి దివంగత ప్రధాని పీవీ నరసింహారావు పుట్టిన వంగర గ్రామాన్ని మరో విధంగా చరిత్రలో నిలపనున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్ఐలు ప్రవీణ్ సాయిబాబు, దివ్య తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులు ఏకాగ్రతను పెంచుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థులు ఏకాగ్రతను పెంచుకోవాలని రామకృష్ణ మఠం చైర్మన్ స్వామీ బోదమయానంద మహారాజ్ అన్నారు. సోమవారం సోషల్ వాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనగామలోని ఏకశిల పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు స్వామీజీ 'వ్యక్తిత్వ వికాసం.. దేశ నిర్మాణం' అనే అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఏకాగ్రతను, ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని, ఐక్యతను, నాయకత్వ పటిమను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మంగళంపల్లి రాజు, స్వామీ వివేకానంద సేవాసమితి కోఆర్డినేటర్ సూర్య ప్రకాష్, ఫౌండేషన్ డైరెక్టర్ దేవి ప్రసాద్, సభ్యులు తుంగ కౌశిక్, శ్రీకాంత్, ఏకశిల పబ్లిక్ స్కూల్ ప్రతినిధులు రామకృష్ణ, రమేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి యోగ పోటీల్లో

# నల్లగొండ విద్యార్థుల ప్రతిభ



**నల్లగొండ, మన చౌరాస్తా :** ఈ నెల 7, 8వ తేదీల్లో ఆదిలాబాద్ లోని రత్న గార్డెన్ లో నిర్వయించిన 6 వ రాష్ట్ర స్థాయి యోగసన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి సిల్వర్, బ్రోంజ్ మెడల్ సాధించారు. సీనియర్ మెన్ కేటగిరీ లో శివమణికి బ్రోంజ్ మెడల్, సీనియర్ విమెన్ కేటగిరీలో శివానికి సిల్వర్ మెడల్, ప్రతిష్ట బ్రోంజ్ మెడల్ సాధించారు. విజేతలను నల్లగొండ జిల్లా యోగసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోట సింహాద్రి, జనరల్ సెక్రటరీ రాయనబోయిన శ్రీను అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో జిల్లాకి పేరు తీసుకురావాలని కోరారు.

# విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- **పౌష్టికాహారం తీసుకోవాలి**
- **కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :**

విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలను నిరోధించే సూక్ష్మజీవులు (పరాన్న జీవులు) నులి పురుగులను నిర్మూలించడం అత్యంత ప్రాధాన్యత అని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేగుల్లో ఏర్పడే నులిపురుగుల వల్ల పిల్లల ఎదుగుదల మందగించడం, నీరసం, రక్తహీనత, చదువులో ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలతో బాధపడతారని, వీటని నివారించేందుకు ప్రభుత్వం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తుందన్నారు. జిల్లా లో 1,13,888 మంది విద్యార్థులకు మాత్రలను వేసేందుకు చర్యలు తీసుకున్నామాన్నారు. పిల్లల పొట్టల్లో నులి పురుగులు చేరితే రక్తహీనత, ఆకలి మందగించడం, విరోచనాలు, బరువు తగ్గడం సమస్యలు లాంటివి ఎదురవుతాయని, వీటిని నివారించేందుకు ఏడాది నుండి 19 సంవత్సరాల వరకు పిల్లలు ఆల్బెండజోల్ మాత్రలను వైద్యుల సూచన మేరకు వేసుకోవాలని




కలెక్టర్ అన్నారు. అపరిశుభ్రత వల్లే నులిపురుగులు సంక్రమిస్తాయని చేతిగోర్లను శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవాలని విద్యార్థులకు ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఆల్బెండజోల్ మాత్రలు వాడటం వల్ల కడపు లో నులిపురుగులు తగ్గిపోతాయని, వీటిని నిర్మూలించడం వల్ల రక్తహీనత నియంత్రణలోకి వస్తుందని, పోషకాహార అవసరాన్ని మెరుగుపరుస్తుదన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి మల్లికార్జున రావు, కళాశాల ప్రిన్సిపాల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలను త్వరగా పరిష్కారించండి

- **కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** గ్రీవెన్స్ డే సందర్భంగా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రజల వద్ద నుంచి సోమవారం దరఖాస్తులు స్వీకరించారు. చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన ఎడ్ల రజిత దరఖాస్తు అందిస్తూ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరింది. జనగామ మండలం పెంబర్తి గ్రామానికి చెందిన కె.గీతాంజలి తన దరఖాస్తు అందిస్తూ 10 సంవత్సరంలుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నామని, ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జనగామ మండలం పెద్దపహాడ్ కు చెందిన మోకు అనూష తమకు వారసత్వంగా సంక్రమించిన భూమిని చట్ట ప్రకారం కూతురు మోకు అక్షరకు చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బచ్చన్నపేట మండలం బచ్చన్నపేట రెవెన్యూ పరిధిలో 176, 178, 177లోని 2 ఎకరాల 27 కుంటల భూమి ని ఈరు కొమురయ్య కుమారులమైన మల్లయ్య, కనకయ్య లకు పంచి ఇవ్వాలని కోరారు. పాలకుర్తి మండలం గూడూరు పంచాయతీ మొరుసుగడ్డ



తండా కు చెందిన బాణోత్ లింగ్య దరఖాస్తు అందిస్తూ తనకు 4గురు కుమారులు ఉండగా అందులో ఇద్దరు కుమారులు వెంకన్న, శ్రీనివాస్ మోసం చేసి 9ఎకరాల 30 కుంటల భూమిని వారి పేరున పట్టా చేయుంచుకున్నారని, తన భూమి తనపేరు కు మార్చాలని విజ్ఞప్తి చేశారు. గ్రీవెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఒక చిన్నారి



కలెక్టర్ కు రాఖీ కట్టడంతో చిన్నారి అభిమానానికి కలెక్టర్ మురిసిపోయారు. చివరగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాల చే ఏర్పాటుచేసిన చేనేత వస్త్రాలను, పచ్చళ్లను, షాంపూలను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవో గోపిరామ్, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు వారి సిబ్బంది పాల్గొన్నారు.



# టెన్నిస్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

**ఉమ్మడి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్ ఖాన్**

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండలో టెన్నిస్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానని ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి. అజీజ్ ఖాన్ స్పష్టం చేశారు. సోమవారం హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎన్ఎస్ స్టేడియంలోని టెన్నిస్ గ్రౌండ్లో పంద్రాగస్టు టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అజీజ్ ఖాన్ మాట్లాడుతూ జేఎన్ఎస్ స్టేడియంలోని టెన్నిస్ కోర్టులో ఫ్లడ్ లైట్లు,క్ల కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్ జిల్లాను క్రీడా హబ్ గా ఏర్పాటు చేయాలని సంకల్పించిందని తెలిపారు. త్వరలోనే హనుమకొండలో స్పోర్ట్స్ స్కూల్, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సన్నహాలు జరుగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ ప్యాట్రాన్ ఇవి శ్రీనివాస్ మాట్లాడుతూ హనుమకొండలో విస్తరిస్తున్న టెన్నిస్ క్రీడకు కావలసిన మౌలిక వసతుల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబు రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఘనంగా టెన్నిస్ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నల్ల సురేందర్ రెడ్డి, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ జిల్లాలోని ఔత్సాహిక క్రీడాకారులను వెలుగులో తీసుకొచ్చేందుకు హనుమకొండలో ప్రతి నెల ఒక టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు, ఈ పోటీలో ప్రథమ బహుమతి నాగయ్య(ఏసీపీ), శ్రీధర్ (ఆర్ ఐ) జోడి ప్రథమ స్థానంలో నిలవగా, శివ రాజ్, రోహిత్ జంట ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, ఏసిపి అంబటి నర్సయ్య, పాటర్న్ కె. రవిచంద్ర, కోశాధికారి సిరికొండ సుదర్శన్, ఉపాధ్యక్షులు కుంజు బిహారి, వెంకట్ నారాయణ, మల్లారెడ్డి, పెరుమాండ్ల వెంకట్, వినీల్, సాత్విక్, శివ రాజ్, వినయ్ వర్ధన్ రెడ్డి, కార్తీకుమారి, రడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం

**నల్లగొండ, మన చౌరాస్తా :** క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని జిల్లా ప్రధాన జడ్జి ఎం.నాగరాజు అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ నల్లగొండ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా న్యాయవాదులకు సోమవారం మేకల అభినవ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిరంతరం బిజీగా ఉండే న్యాయవాదులకు క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా క్యారమ్స్ చెస్ క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఇండోర్ ఔట్డోర్ క్రీడా పోటీలను నిర్వహించి, గెలుపొందిన వారికి స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బహుమతులు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్జిలు మొదటి అదనపు జిల్లా జడ్జి సంపూర్ణ ఆనంద్, కార్యదర్శి మంద నగేష్, కోశాధికారి బరిగల నగేష్, జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వీరబాబు న్యాయవాదులు ,న్యాయశాఖ సిబ్బంది, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.